ప్రజాశక్తి

సోమవారం 28 జులై 2025

5

పార్వతీపురం మన్యం

మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీల నమోదు

పార్వతీపురం : మీకోసం వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్ లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ ఎస్) లో సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in) వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

రేకులగూడ బ్రిడ్జి పూర్తయ్యేదెప్పుడు?

- అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణమా?

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, ప్రతి గిరిజన తండాకు రోడ్లు, ఇళ్లు, తాగునీటి, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గిరిజనుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నామని పాలకులు, అధికారులు చెప్పుకోవడం సాధారణమైపోయింది. అయితే ఇవి ఆచరణలో క్షేత్ర స్థాయిలో మచ్చుకైనా కనిపించవు. ఇందుకు నిదర్శనం ఆరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన రేకులగూడ బ్రిడ్జి పనులే.

స్థానిక ఐటిడిఎకు పది కిలోమీటర్లు దూరానున్న పులిపుట్టి పంచాయతీ రేగులగూడ బ్రిడ్జి 2018లో సంభవించిన తిత్లీ తుఫాన్‌కు కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలుపడుతున్నారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే చాలు గెడ్డ దాటేందుకు బిక్కు బిక్కు మంటున్నారు. ఎగువన వర్షాలు పడితే పెద్ద గెడ్డ రావడంతో బ్రిడ్జి ఇవతల ఉన్న వెంపలగూడ, రేగులగూడ, రేగులగూడ కాలనీ, పాత రేగులగుడ, ఈతమానుగూడ, కారిగూడ గ్రామస్తుల రాకపోకలు నిలిచిపోతాయి. గెడ్డ ఉధృతి తగ్గేంత వరకు రాకపోకలు స్తంభిస్తాయి. లేకుంటే చుట్టూ తిరిగి రేగులు గూడ నుంచి ఈతమానుగూడ, ముకుందపురం మీదుగా గుమ్మడ మెయిన్ రోడ్డుకు వచ్చి బస్సు ఎక్కాలి. ఇందుకు కనీసం గంట సమయంతో పాటు అదనంగా 10 కిలోమీటర్లు దూరం పెరుగుతుంది. ప్రస్తుతం వంతెన లేకపోవడంతో గెడ్డపక్కన ఉన్న పొలాల్లో డొంకలను చదును చేసుకొనేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు లేకపోవడంతో గ్రామస్తులే ఇంటింటికీ చందాలు వేసుకొని బాగు చేస్తున్నారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన రేగులు గూడ బ్రిడ్జి

వెంపల గూడలో విద్యార్థులు రేగులు గూడ పాఠశాల అర కిలోమీటర్ దూరంలో ఉన్నప్పటికీ బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహించడంతో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మడ పాఠశాలకు చిన్నారులు నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా అత్యవసర సమయంలో 108, 104 అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటం చుట్టూ తిరిగి గుమ్మడ, ముకుందపురం మీదుగా వెళ్లాలంటే ఆ రహదారినే ప్రస్తుతం బాగు చేస్తున్నారు. గతంలో ఎదురు కర్రలతో బ్రిడ్జి వేశారు. అది కూడా వర్షాలకు తడిచి పాడైపోయింది. అత్యవసర సమయాల్లో పురుషులైతే ప్రాణాలకు తెగించి గెడ్డ దాటుకొని వెళ న్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు వెళ్లలేని పరిస్థితి.

తిత్లీ తుఫాన్‌లో బ్రిడ్జి కూలిపోవడంతో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు సందర్శించారు. 2019లో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.1 కోట్ల 40 లక్షలతో బ్రిడ్జి మంజూరు చేశారు. అప్పటి ఉన్నతాధికారులు కలెక్టర్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు పనులు చేయించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అంతవరకు బాగానే ఉంది. అయితే ఇప్పటి వరకు మొండి గోడలు, కాలమ్స్ లెవెల్ వరకు వేసి వదిలేశారు. ఆరేళ్లు గడుస్తున్నా బ్రిడ్జి పూర్తికాలేదు. బిల్లులు కాలేదని కాంట్రాక్టర్ జాప్యం చేశారు. దీంతో పాటు ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్ అండ్ బి అధికారులను అడిగితే ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు చూస్తున్నారని చెప్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులకు అడిగితే గతంలో ఆర్ అండ్ బి అధికారులు పనులు చేయించారని, తమకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారని చెప్పుకొస్తున్నారు. రెండు శాఖల ఇంజనీరింగ్ అధికారులు మాది కాదంటూ మాది కాదు అంటున్నారు. దీంతో ఈ బ్రిడ్జి పరిస్థితి అయోమయంలో పడింది. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమైంది. ఇక వర్షాలు ముంచుకొస్తున్నాయి. ఈ ఏడాదైనా బ్రిడ్జి పనులు పూర్తవుతాయో, లేదోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బి డిఇ జగన్నాధరావు వద్ద ప్రస్తావించగా అది తమకు సంబంధం లేదని,ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు చూస్తున్నారని చెప్పారు.

వర్షాకాలంలో అటవీ ఉత్పత్తులు తీసుకెళ్లలేకపోతున్నాం

వర్షాకాలంలో గెడ్డ వస్తుంది. సేకరించిన అటవీ ఉత్పత్తులైన అరటి గెలలు, పైనాపిల్, అల్లం తదితర ఉత్పత్తులు తీసుకుని వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాలి. లేకుంటే గెడ్డ దాటుకుంటూ ముందుకు పోవాలి.

సవర జర్జింగ్, గిరిజనుడు రేగుల గూడ.

టిడబ్ల్యు సిఇకి వినతి సమర్పించాం

అమరావతిలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ఎస్ శ్రీనివాస్‌కు మా బ్రిడ్జి పూర్తి చేయాలని ఇటీవల వినతి సమర్పించాం. బ్రిడ్జి మంజూరై ఆరేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదని వెంటనే పూర్తి చేయాలని కోరాం. అంతేకాకుండా ప్రస్తుతానికి ఈతమానుగూడ, ముకుందపురం, గుమ్మడ మెయిన్ రోడ్డు సెంటర్‌కు వాహనాలు వచ్చేలా రెండు గ్రామాలు మమేకమై ఇంటింటికీ చందా వేసుకొని దారి బాగు చేసుకుంటున్నాం.

సవర రాజ్ కుమార్, గిరిజన యువకుడు రేగులగూడ.

బ్రిడ్జ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

రేగులుగూడ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మా ఇంజినీర్లు ఆర్ అండ్‌బి ఇంజనీర్లతో మాట్లాడడం జరిగింది. ఎన్ ఆర్ ఇ జి ఎ న్ లో నిధులు ఉన్నాయి. త్వరలోనే బ్రిడ్జి పనులు ప్రారంభిస్తాం. గతంలో ఆర్అండ్‌బి అధికారులు పనులు చేపట్టారు. వారు ఎంతవరకు పనులు చేశారో నివేదిక తీసుకుంటాం.

కెవి.ఎస్.ఎన్ కుమార్, టి డబ్ల్యు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీతంపేట ఐటిడిఎ.

కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఎక్కడా లేని ఆంక్షలు ఇక్కడెందుకో?

- జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బారికేడ్లు
- తప్పు పడుతున్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో కొత్తగా బారికేడ్లు దర్శనమిస్తున్నాయి. జిల్లా ఏర్పడి మూడేళ్ళు దాటింది. గతంలో పని చేసిన అధికారులు ఎప్పుడూ ఇటువంటి బారికేడ్లను కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేయలేదు. గత కొద్ది రోజులుగా కలెక్టరేట్ ఆవరణలో ఆంక్షలు విధించడం చర్చనీయాంశమవుతోంది. జిల్లా అధికారుల వాహనాలను మాత్రమే లోపలికి అనుమతించి మిగిలిన వాహనాలను బారికేడ్ల వెలుపల పార్కింగ్ చేయాలని నిర్దేశించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ గిరిజన, ప్రజాసంఘాలు తరచూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతులు అందజేస్తుంటాయి. వినతులు పరిష్కారం కాకపోతే ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేస్తుంటాయి. ప్రధానంగా మన్యం జిల్లాలో గిరిజన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు బాధిత ప్రజలతో కలిసి వస్తున్నారు. ఇంతవరకు ఇలాంటి కార్యక్రమాలు కలెక్టరేట్ ఆవరణలో సజావుగా జరిగాయి. గడచిన మూడేళ్లలో ఎన్నడూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. మరి అలాంటి పరిస్థితుల్లో జిల్లా అధికారులు కలెక్టరేట్ ఆవరణలో ఆంక్షలు విధించడమెందుకనే చర్చ జరుగుతోంది. కలెక్టరేట్ ఆవరణలో బారికేడ్లు ఏర్పాటు చేయడాన్ని గిరిజన, ప్రజాసంఘాల నాయకులు తప్పు పడుతున్నారు. ఎక్కడా లేని ఆంక్షలు ఇక్కడెందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో ప్రజలు వినతులు అందజేయడానికి వస్తారు. పదే పదే వినతులు అందజేస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదనే ఆందోళన లో కొంతమంది ప్రజలు ఉన్నారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారం వారం గ్రీవెన్స్ సెల్ నిర్వహణ మొక్కుబడి కార్యక్రమంలా సాగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కలెక్టరేట్ ఆవరణలో ఆంక్షలు విధించడం సరికొత్త చర్చ కు దారి తీస్తోంది.

లక్ష్మీపురంలో ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఎక్కడ మురుగనీరు, డ్రమ్ముల్లో, ఫ్రిడ్జ్ వెనుక భాగాల ఉన్న నీటిని తొలగిస్తున్నారు. దోమల వల్ల జ్వరాలు వస్తున్నాయని, నీరు నిల్వ లేకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కలిగిస్తూ ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి రమ్య సాయి, హెచ్‌ఎస్ గోపాలరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్ఒ హరిప్రియ, ఆశా కార్యకర్తలు రమ, కృష్ణవేణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు

ఎరువుల కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు . జిల్లాలో ఎరువుల పంపిణీ పరిస్థితిని పర్యవేక్షణ చేస్తున్నామని, పలు మండలాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల లభ్యత, పంపిణీ జరుగుతున్న విధానాన్ని పరిశీలించినట్టు తెలిపారు. రైతులు యూరియాను అధిక మొత్తంలో వాడరాదని ఆయన కోరారు. జూలై చివరి నాటికి జిల్లాలో దాదాపు 11,327 టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 12,544 టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయని తెలిపారు. ఈనెలాఖరుకు జిల్లాలో దాదాపు 11,327 టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 12,544 టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయని ఆయన చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు 9,557 టన్నుల యూరియా వినియోగించగా, మిగిలినది ఆర్ఎస్‌కెలు, సొసైటీల్లో అందుబాటులో ఉందని, ఇటీవల 600 టన్నుల ఆర్‌సిఎఫ్ కంపెనీ యూరియా జిల్లాకు చేరాయని ఆయన తెలిపారు. జిల్లాకు మరో 3, 4 రోజుల్లో క్రిభ్కో కంపెనీకి చెందిన యూరియా రానుందని, పంటల సాగు నమోదైన మండలాలకు ప్రాధ్యాన్యతా క్రమంలో యూరియాను కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 966 టన్నులు, సొసైటీలు, రైతు సేవ కేంద్రాల వద్ద 1800 టన్నులు యూరియా, మార్క్‌ఫెడ్ వద్ద 120 టన్నుల బఫర్ యూరియా నిలువలు ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. రానున్న ఆగష్టు సెప్టెంబర్ నెలల్లో కూడా జిల్లా అవసరాలకు సరిపడా యూరియా రానుందన్నారు. యూరియా కావాల్సిన రైతులు విక్రయ కేంద్రాన్ని సందర్శించి, వారి బయోమెట్రిక్, ఆధార్ వివరాలు ఇ - పాస్ లో ఆన్ లైన్ విధానంలో నమోదు చేసి ఎరువుల కొనుగోలు చేయాలని సూచించారు. మిగతా ఎరువులైన డీఏపీ, పోటాష్, సూపర్ ఫాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఇప్పటి వరకు 245 రైతు సేవ కేంద్రాల ద్వారా 7,235 టన్నులు, 22 సొసైటీల ద్వారా 1,369 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. అలాగే ద్రవ రూప ఎరువులైన నానో యూరియా, డిఏపి ఎరువులను రైతు సేవ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఎరువులకు సంబంధించి ఏవైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం అవసరమైతే జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు (7989434766) కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

పెద్దగెడ్డ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

మండలంలోని పెద్దగెడ్డ జలాశయంలో సర్వం కోల్పోయిన కొటికిపెంట నిర్వాసితులకు ఆదుకోవాలని ఆ గ్రామ గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ స ం ద ర్భ ం గా కొటికపెంట నిర్వాసితులైన దళిత కాలనీకి చెందిన వంతల పారమ్మ, ఎరుకలమ్మ, వంతల ప్రసాదు, తదితరులు మాట్లాడుతూ కొటికిపెంటలో పెద్దగెడ్డ జలాశయం వల్ల భూములు కోల్పోయామని, దీంతో నిర్వాసితులుగా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దగెడ్డ జలాశయంలో ఉన్నటువంటి రిజర్వాయర్ నీరు తమ గ్రామంలోకి చేరి ముంపునకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాత్రి వేళ విష సర్పాలు వచ్చేస్తున్నాయని, దోమలు విపరీతంగా కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతూ భయానకమైన పరిస్థితుల్లో బతుకుతున్నామని తెలిపారు. వి.ఎరుకులమ్మ మాట్లాడుతూ దోమల కాటు వల్ల ఒళ్లంతా మచ్చలు ఏర్పడి ఎంత డబ్బు ఖర్చుపెట్టినా తనకు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటి గ్రాంటు పెంచి, ప్రభుత్వం చూపించిన స్థలాలకు పంపించేలా ఇంటి నిర్మాణం చేపట్టి మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. పెద్దగెడ్డ జలాశయం నిర్వాసితుల సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పెద్దగెడ్డ జలాశయం వల్ల కొటికి పెంట గ్రామస్తులు పూర్తిగా నష్టపోయారని, ఇందులో రైతులు అధికంగా భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, యుద్ధ ప్రాతిపదికన ఇంటి నిర్మాణం చేపట్టాలని, గ్రాంట్ కూడా రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం పెంచి వారిని ఆదుకొనేలా ఇంటి నిర్మాణం పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కోసం పూర్తిగా భూములను త్యాగం చేసి నిర్వాసితులకు వెంటనే ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటాలకు సిద్ధం

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, నేడు ఆ హామీ మరిచిపోయి కార్మికులను అణగదొక్కే నిర్ణయాలు చేపడుతుందని, వీటిపై ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పోరాడుతుందని ఆ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు తెలిపారు. పట్టణంలో ఆదివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సాలూరు పట్టణ నాలుగో మహాసభ ఫెడరేషన్ పట్టణ కమిటీ అధ్యక్షులు తుపాకుల రాముడు అధ్యక్షతన కొంకి వీధి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి నాయుడు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా కార్మిక తీర్మానాలను ప్రభుత్వం పరిష్కరించుకుంటే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ వయస్సును కాంట్రాక్ట్ కార్మికులందరికీ 62 ఏళ్లకు పెంచాలని, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ తల్లికి వందనం, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి హామీ ని నిలుపుకోవాలని, గత 17 రోజుల సమ్మె సందర్భంగా అధికారులు, అప్పటి ప్రభుత్వంతో కుదుర్చుకున్న మినిట్స్ ఆధారంగా చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం పెంచాలని, దహన సంస్కార ఖర్చులు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌కు వెంటనే జీవోలు విడుదల చేసి అర్హులైన వాళ్లందరికీ న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రంగంలో నెల్లూరు జిల్లాలో వర్క్ అవుట్సోర్సింగ్‌ను మోడల్‌గా అమలు చేయాలనుకున్న ప్రాజెక్టు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నివాసం ఉంటున్న వీధులు, వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, శ్మశాన వాటికలకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక వర్గం ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ సాలూరు పట్టణ కార్యదర్శి టి.శంకర్రావు కోశాధికారి ఈశ్వరరావు. మహిళా కన్వీనర్ ఇందు, మీడియా ఇన్చార్జి రవి ప్రసంగించారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

నూతన కమిటీ ఎన్నిక

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సాలూరు పట్టణ నూతన కమిటీ 12మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శంకర్రావు, టి.రవి, కోశాధికారిగా టి.రాముడు, మహిళ కన్వీనర్‌గా టి.ఇందు, కో-కన్వీనర్‌గా జె స్వప్న, మీడియా ఇన్చార్జిగా టి.శ్రీను, కమిటీ సభ్యులుగా మరో నలుగుర్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

పార్వతీపురం టౌన్ : స్థానిక సుందరయ్య భవనంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాలుగో మహాసభ సిహెచ్ సింహాచలం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు

మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

నాయకులు వై.మన్మథరావు, డి.రమణారావు, గొర్లి వెంకటరమణ, బివి రమణ తదితరులు మాట్లాడారు. స్థానిక మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురైన విషయాన్ని అధికారులు తెలిపినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మున్సిపల్ కార్మికుల పనిముట్లు మరమ్మతులు చేస్తున్నట్లు బడ్జెట్లో పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అవేవీ కాన రావడం విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పని భారాన్ని పెంచే పని గంటల పెంపు ఆలోచన విరమించుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియమించిన పారిశుద్ధ్య కార్మికులను ఈ ప్రభుత్వం తొలగించే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా నాగవంశం శంకర్రావు, పి వరదరాజు తో పాటు 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఎం.శివ, రవి, పి.గాంధీ, ఎన్.మల్లేష్, నిర్మల, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సిఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ:2,02,199 చెక్కును సాలూరు మండలం మరిపల్లికి చెందిన లబ్ధిదారుడు వేమూరి నరేష్‌కు మంత్రి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు నరేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తుందని మంత్రి అన్నారు.

డివిజిని సన్మానించిన బాగువలస నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును మండలంలోని బాగువలసకు చెందిన నాయకులు, పెద్దలు సన్మానించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ డివిజి శంకరరావు గిరిజన సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, గ్రామపెద్ద మత్స భాస్కరరావు, మోహన్‌రావు దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఆదివారంతో ఆయన పదవీకాలం ముగియడంతో గ్రామపెద్దలు సన్మానించారు.

శంకరరావును సన్మానిస్తున్న నాయకులు

అనంతరం గుండెపోటుతో ఇటీవల మరణించిన ఉపాధ్యాయులు కోట బాలకృష్ణ కుటుంబ సభ్యులను డివిజి శంకరరావు పాలికవలస వెళ్లి పరామర్శించారు. బాలకృష్ణ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

మహిళలకు ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం : కళా

ప్రజాశక్తి - పాలకొండ

రా ష్ట్ర ం లో మహిళలు ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చు మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఆదివారం టిడిపి నేత సుంకర అనిల్‌దత్ స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ పోస్టులకు నియమకానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సర్వీస్ కమిషన్ ద్వారా మరో రెండు వేల ఉద్యోగాల నియామకానికి కూడా చర్యలు చేపడుతుందన్నారు. గత ప్రభుత్వం మద్యం వ్యాపారం చేస్తుందన్నారు. కల్తీ మద్యంతో ఎంతో మంది ప్రాణాలు పోయాయన్నారు. తప్పులు చేసిన వారిని చట్టం శిక్షిస్తుందని, అంతే తప్ప తమ కూటమి ప్రభుత్వం ఎవరిపైనా అక్రమంగా కేసులు పెట్టడం లేదన్నారు. వైసిపి నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చెయ్యడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి తూట్లు పొడిచిందని విమర్శించారు. భోగాపురంలో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. తోటపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభించిన ప్రభుత్వం, దాన్ని పూర్తిచేసే బాధ్యత కూడా తామే తీసుకుంటున్నామని అన్నారు. విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అనిల్, వెన్నపు శ్రీనివాసరావు, రాంబాబు, అంపోలి శ్రీను తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకట్రావు

హాస్టళ్లలో వసతులు కరువు

- సమస్యల మధ్య అరకొర చదువులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

శిథిలావస్థలో ఉన్న ఎండభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

గిరిజన మారుమూల ప్రాంతంలో గల వసతి గృహాలను పట్టించుకునే వారే లేకపోవడంతో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ విద్యాభ్యాసాలు చేస్తున్నారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో భయాందోళన నడుమ విద్యార్థులు కాలం వెళ్లబుచ్చాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగానూ, రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యం లేకపోగా, తలుపులు సరిగ్గా లేకుండాపోయాయి. అలాగే వసతిగృహ కిటికీలకు మెస్‌లు వేయకపోవడంతో ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల ప్రభావం ఎక్కువ కావడంతో విద్యార్థులు పడుకునేందుకు అవస్థలుపడుతున్నారు. విద్యార్థులు ఇన్ని కష్టాలు అనుభవిస్తున్నా కనీసం హాస్టల్ వైపు ఐటిడిఎ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గానీ కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్కా భవనాలు ఎలాగూ లేవు కానీ కనీసం మంచినీరు, ఉండడానికి వసతులు కల్పించాలని విద్యార్థులు విద్యార్థులు వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి-కొమరాడ

మండల కేంద్రమైన కొమరాడ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎండభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 96 మంది విద్యార్థులు కష్టాలు వర్ణనాతీతమని చెప్పొచ్చు. ఈ వసతిగృహంలో మౌలిక సదుపాయాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మంచినీటి సౌకర్యం నుంచి పడుకోవడానికి వసతి కూడా లేదు. వాటర్ ట్యాంక్ చిన్నది కావడంతో విద్యార్థుల అవసరాలకు, వంట కోసం కనీసం నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆశ్రమ పాఠశాలకు ఎటువంటి బోరు సదుపాయం లేకపోవడంతో దూరంగా ఉన్న గెడ్డ నుంచి మోటార్ సహాయంతో నీరు వస్తుంది. ఇది కేవలం విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే. మిగిలిన సందర్భంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉండడంతో వర్షాలు పడిన సమయంలో శ్లాబు నుంచి వర్షం జల్లులు పడడంతో పడుకోవడానికి, ఉండడానికి, చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. గచ్చులు కూడా సక్రమంగా లేకపోవడంతో అనేకమార్లు విద్యార్థులు ఆ గోతుల్లో పడి గాయాలైన ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. తరగతి గదిలోనే పడుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు వాపోతున్నారు. డార్మెటరీ గదుల్లో సరైన వసతి సౌకర్యం లేకపోవడంతో ఫ్యాన్లు, కిటికీలు సక్రమంగా లేకపోవడంతో దోమలబారిన పడి అనారోగ్యాల గురవుతున్నామని విద్యార్థులు తెలిపారు. అలాగే డార్మెటరీలో జన చేయడానికి అవకాశం లేకపోవడంతో తరగతి గదులు కొంతమేరకు ఫ్యాన్లు సౌకర్యం ఉండడంతో అక్కడే పడుకుంటున్నామని విద్యార్థులు చెప్పారు. గతంలో కోటి రూపాయలు నిధులతో మంజూరైన అదనపు గదులు నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో వసతి సమస్య తీవ్రంగా వేధిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురవ్వడంతో కనీసం తాగేందుకు నీరు లేక గెడ్డ నుంచి నీటిని తాగడంతో జ్వరాల బారిన పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. గత కంటే ఈ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, అదనపు సౌకర్యాల వల్ల ఇంకా విద్యార్థుల చేరికలు పెరగడం లేదని స్థానికుల నుంచి ఆరోపణ వినిపిస్తున్నాయి. గిరిజన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్న ఐటిడిఎ, ప్రభుత్వాలు కనీసం వారికి వసతి, ఇతర సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ వసతి గృహంపై ప్రత్యేక దృష్టి పెట్టి తాత్కాలికంగానైనా విద్యార్థుల అవసరాల మేరకు మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే పడుకునేందుకు డార్మెటరీ గదులకు ఫ్యాన్లు, కిటికీలు మెస్సలు, గచ్చులు వేసి సదుపాయాలు కల్పిస్తే ఇక్కడ బాగా చదువుకుంటామని విద్యార్థులు తెలుపుతున్నారు.

ఊడిన గచ్చులు

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిసిడిఒ రామలక్ష్మి

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - భామిని

బాలికలు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిసిడిఒ రామలక్ష్మమ్మ అన్నారు. సింగిడి కళ్యాణ మండపంలో హెూలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఆదివారం గ్లోబల్ బాలికలతో ఆత్మవిశ్వాసం అనే అంశంపై శిక్షణా సమావేశం నిర్వహించారు. బాలికలు బాలురుతో పాటు సమానంగా విద్యలో ముందుండాలని, లింగ వివక్షత అధిగమించి బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలని, ప్రతి బాలికకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన ఉండాలని తెలిపారు. హెూలీ క్రాస్ అనే స్వచ్ఛంద సంస్థ బాలికలు, మహిళల సాధికారత కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూలీ క్రాస్ సంస్థ కార్యకర్త శ్రీవిద్య, మెంటార్స్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సపర్యాలు చేయిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని టిక్కబాయి, తోటగూడ గ్రామాల సమీపంలో శనివారం ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. బైక్‌పై ప్రయాణిస్తున్న మూలిగూడ గ్రామానికి చెందిన కోలక రామారావు, పి.ఆమిటి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. అదే సమయంలో ఆ మార్గం గుండా వస్తున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను దగ్గరుండి ఆసుపత్రికి పంపించారు.

వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి, గ్రామ నాయకులు

వృద్ధులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎజిజె అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి విజయనగరం జిల్లా వంగర మండలం, రాజుల గుమడ గ్రామంలోని పేద మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు చీరలు, రగ్గులు, పంచిలు, తువ్వాల్లు, పండ్లును ఆ గ్రామ పెద్దలు ఆలుబిల్లి. అప్పలనాయుడు సుదర్శనరావు, వెంకట నాయుడు, పార్థసారథి, వంశీ వర్ధన్, గోపాలనాయుడు, బొత్స గణపతి, గడగమ్మ నాగేశ్వర రావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా పెద్దలు కృష్ణమూర్తిని దుస్సాలువా కప్పి సన్మానిస్తూ మీ సేవలు నిస్వార్థమైనవని, వెల కట్టలేనివని కొనియాడారు..

క్రికెట్ పోటీ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న సిఐ హరి

వ్యసనాలకు లోనవ్వకూడదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యువత చెడు వ్యసనాలకు లోనవ్వకుండా చదువుపై దృషి పెట్టి మంచి ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేయాలని ఎల్విన్ పేట సిఐ బి.హరి సూచించారు. ఆదివారం ఆయన ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని కె.శివడ గ్రామంలో యువతకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో యువత నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ క్రీడల్లో పాల్గొని బహుమతులు అందజేశారు. గ్రామంలోని యువత మహిళా సంఘాలు పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని హితవు పలికారు. కిషోరీ బాలికలకు పోక్సో కేసుల పై అవగాహన కల్పించారు. యువత క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్లను అందించారు. అనంతరం గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బి.శివ ప్రసాద్, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో నడిపితే చర్యలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పలు రహదారుల్లో ఇనుప దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పలు గ్రామాల ట్రాక్టర్లు యజమానులకు అవగాహన కల్పించారు. రహదారులు భద్రత దృష్ట్యా ఇనుప చక్రాలకు బెల్టులు వేసుకొని నడపాలని, లేకుంటే పొలాల వద్ద మాత్రమే ఇనుప చక్రాలను ఉపయోగించాలని ఆయన సూచించారు. నిబంధనను అతిక్రమించిన టాక్టర్ల డ్రైవర్ల పైనా, యజమానులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్‌కు బెల్టు ఏర్పాటు చేస్తున్న డ్రైవర్

పామాయిల్ తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గోలవలసలో శెట్టి సురేష్ అనే రైతు పామాయిల్ తోటను ఆదివారం సాయంత్రం ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా రైతు సురేష్ మాట్లాడుతూ రెండు ఎకరాల్లో పామాయిలను సాగు చేస్తున్నానని, మొక్క దశలోనే పూర్తిగా రెండెకరాలు పంటను కూడా ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు సుదీర్ఘకాలంగా తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నా అధికారులు ఎందుకు వాటిని తమ పరిసర ప్రాంతాల నుంచి దూరంగా తీసుకువెళ్లడం లేదు అర్థం కావడం లేదని అన్నారు. పంటలే కాక ఎంతోమంది రైతుల ప్రాణాలు పోతున్నా అధికారులకు, పాలకులకు కనీసం చలనం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు అంచనా వేసి పరిహారం ఇచ్చి, ఏనుగులను తమ పరిసర ప్రాంతాల నుంచి దూరంగా తరలించాలని కోరుతున్నారు.

గోల వలసలో పామాయిల్ తోటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

గోలవలసలో ఏనుగులు గుంపు సంచారం

మండలంలోని గుమ్మడి గూడ పంచాయతీ గోలవలస పరిసర ప్రాంతాల్లో గల అరటి, చెరుకు, పామాయిల్ తోటల్లో ఏనుగుల గుంపు ఆదివారం ఉదయం నుంచి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ పరిసర గ్రామాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఏనుగుల కదలికలను తెలుసుకొని వెళ్తుండాలని తెలిపారు. అలాగే ఈ రహదారి వెంట ప్రయాణించే వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సీతానగరం

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనుల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని సువర్ణముఖి నదిపై కొత్తవలస వద్ద నిర్మించిన సీతానగరం ఆనకట్టు సాగునీటిని ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు దిగువన 3500 ఎకరాల్లో సాగు విస్తీర్ణం అవుతుందని, ఈ ఖరీఫ్‌కు రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా నీరందుతుందని అన్నారు. దీంతో పంట దిగుబడి బాగుంటుందన్నారు. ఈ ఆయకట్టు కోసం రూ.32 కోట్లు ప్రతిపాదల్లో పంపించామని, వచ్చే ఖరీఫ్ నాటికి 6500 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యం ఉందని అన్నారు. టిడిపి ప్రభుత్వం రైతులతో పాటు బడుగు, బలహీన వర్గాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఆయకట్టు చైర్మన్ తెంటు వెంకటప్పలనాయుడు, వైస్ చైర్మన్ సోమిరెడ్డి రమేష్ నాయుడు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యమనాయుడు. ఆర్.వేణుగోపాల్, కొప్పలవెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడుతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సీతానగరం ఆనకట్ట నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

'ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం'

ప్రజాశక్తి - పాచిపెంట

ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు, ఇక్కడి నాయకులను ప్రోత్సహించడంలోనూ టిడిపి ముందుంటుందన్న విషయం మరోసారి స్పష్టమైందని ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్‌గానూ, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర విమానాయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం తెలుగు దేశం పార్టీకే సాధ్యమని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఉత్తరాంధ్రను దోచుకోవడమే తప్ప ఇక్కడి నాయకులకు గౌవరం ఇవ్వలేదని, ఇక్కడి ప్రజల అభివద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. గత టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన పరిశ్రమలను కూడా ఉత్తరాంధ్ర నుంచి జగన్ రెడ్డి అండ్ ముఠా తరిమేసిందని విమర్శించారు. ప్రఖ్యాత కంపెనీలు టీసీఎస్, కాగ్నిజాంట్, గూగూల్ డేటా సెంటర్లు విశాఖకు తరలివచ్చాయని, విశాఖలో ఐటి సెజ్, ఎన్టీపీసీ గ్రీన్, భోగాపురం ఎయిర్ పోర్ట్, విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ ఇలా ఉత్తరాంధ్రకు ఒక్క ఏడాదిలోనే సాధించారు. ఉత్తరాంధ్ర పరిశ్రమల అభివృద్ధి కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి నిధులు కేటాయించారన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజలపై ముఖ్యమంత్రి చూపిస్తున్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా కనక, పల్లేడ ఉమామహేశ్వరరావు, వెంకటరమణ. మతల బలరాం. కొత్తల పోలినాయుడు. తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నత గౌరవం లభిస్తుందని పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇంచార్జి పడాల భూదేవి అన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతో పాటు నాయకులను కూడా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా కె.రామ్మోహన్‌నాయుడుని కేంద్ర మంత్రిగా మంత్రిగా, సామాన్య కార్యకర్త కె.అప్పలనాయుడును ఎంపిగా చేసి ప్రోత్సహించారన్నారు.

పాలకొండ : టిడిపితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గండి రామినాయుడు అన్నారు. మండలంలోని నక్కలపేటలో గల తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఉత్తరాంధ్ర గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ తో పాటు పలు కంపెనీలు ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్నాయన్నారు. ఉత్తరాంధ్ర పరిశ్రమల అభివృద్ధికిఉత్తరాంధ్ర సుదర్శన స్రవంతి పథకానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు సామాన్య కార్యకర్తలకు అత్యుత్తమ పదవులు లభిస్తున్నాయని ఇందుకుఉదాహరణ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు బేవర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బగ్గందొరవలసలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బగ్గందొరవలసలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యంనాయుడు, ఆర్.వేణుగోపాల నాయుడు, వెంకటప్పలనాయుడు, గ్రామ కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, బి.రాజేంద్రప్రసాద్, తిరుపతిరావు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం మండలంలో నీలకంఠాపురం, మామిడిమానుగూడ, పనసభద్ర, కాకిలి, తోలుముగూడ గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి చైర్మన్ కర్రక కళావతి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు వెంపటా భారతి, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న బాగుజోల- చిలకమెండంగి రోడ్డు పనులు

బాగుజోల - చిలకమెండంగి రోడ్డు పనులు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం బాగుజోల నుంచి చిలకమెండంగి వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. రూ.250 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణ పనులు చేశామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా రఫ్ స్టోన్ ప్యాకింగ్, తారు రహదారిగా మార్చే పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. రహదారి సౌకర్యం లేని గిరిజన ప్రాంతాలకు రహదారులు కల్పించే దిశగా గత ఏడాది డిసెంబర్ 20న మక్కువ మండలం బాగుజోలలో పలు రహదారులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని ఆయన చెప్పారు. బాగుజోల నుంచి చిలకమెండంగి వరకు 2.50 కిలో మీటర్ల రహదారి ఫార్మేషన్ పూర్తి అయిందని, ఇందులో ఒక కిలోమీటరు మేర సీసీ పనులు, మిగిలిన 1.50 కిలోమీటరు మేర డబ్ల్యు ఎం ఎం పనులు పూర్తయినట్లు చెప్పారు. ఇది కొండ ప్రాంతంలో కొత్తగా ఏర్పడిన రహదారి అయినందున, వర్షాకాలం తర్వాత బిటి వేస్తారని స్పష్టం చేశారు.

అలాగే గుమ్మలక్ష్మిపురం మండలంలో రూ.360 లక్షల వ్యయంతో పాములగీసడ నుంచి మంత్రజోల వరకు 3.60 కిలోమీటర్ల మేర బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోగా పూర్తిచేయనున్నట్లు చెప్పారు. 8 కిలో మీటర్ల వరకు మట్టి రహదారి నిర్మాణం జరిగిందని చెప్పారు. సాలూరు మండలం బాగుజోల నుండి సిరివర వరకు 6.60 కిలో మీటర్ల మేర తారు రోడ్డుకు ప్రభుత్వం రూ.9 వందల లక్షలు మంజూరు చేసిందని, మట్టి రహదారి నిర్మాణం పూర్తి జరిగిందని ఆయన తెలిపారు. ఘాట్ రోడ్డు కావడం వలన పలు చోట్ల చదును చేసి పూర్తి చేయాల్సి ఉందన్నారు. భారీ వర్షాలు కారణంగా మూడు , నాలుగు ప్రదేశాల్లో మట్టి కొట్టుకుపోయిందని, దీంతో పనులకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి జరుగుతుందని అన్నారు. పాచిపెంట మండలం అల్లూరు నుంచి రిట్టపాడు వరకు గల రహదారి రూ.400లక్షలతో తారు రహదారిగా నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, అటవీ అనుమతులు పూర్తి చేసి తర్వాత పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడ పంచాయతీ బోరి గిరిజన గ్రామానికి ఆ గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా నడకదారికి సిసి రోడ్డు నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామంలో సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్నామని, తమకు ఏ అవసరం వచ్చినా, నిత్యవసర సరుకులు కావాలన్నా, ఆరోగ్యం బాగు లేకపోయినా కురుపాం, గొటివాడ, గుమ్మలక్ష్మీపురం వెళ్లాలంటే మార్గ మధ్యలో పెద్ద గెడ్డ ఉందని, వర్షాకాలంలో గెడ్డ ఉద్రిక్తంగా వచ్చి దాటే పరిస్థితులు లేక ఎన్నో రోజులు కనీసం నిత్యవసర సరుకులు కూడా నోచుకునే పరిస్థితి లేక ఇబ్బంది పడే సంఘటన ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేకసార్లు బ్రిడ్జి, రోడ్డు నిర్మించాలని వినతి పత్రాలు అందజేసి విసిగి చెందామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి మంజూరైనా పనులు ఏమీ జరగలేదన్నారు. దీంతో గత్యంతరం లేక తామే స్వచ్ఛందంగా కొంత నగదు ఎత్తుకొని కర్రలతో ఇనుప గొట్టాలతో బ్రిడ్జి శ్రమదానంతో నిర్మించుకున్నామని తెలిపారు. ఇప్పుడు వర్షాకాలం కావున రోడ్డు బురదమయమై నడవడానికి ఇబ్బంది పడుతున్నామని, కావున తామే స్వచ్ఛందంగా కొంత నగదును కూడబెట్టి ద్విచక్ర వాహనాలు, నడవడానికి ఉపయోగపడే దారిని సిసి రోడ్డు నిర్మించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధిలు స్పందించి తమ గ్రామానికి వెళ్లే రహదారి, బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నామన్నారు.

శ్రమదానంతో సిసి రోడ్డు నిర్మించుకుంటున్న గిరిజనులు

పోలీసుల అదుపులో నలుగురు జూదగాళ్లు

గరుగుబిల్లి : మండలంలోని రావివలస గ్రామంలో జూదపు ప్రదేశంలో ఆదివారం దాడులు నిర్వహించి నలుగురును అదుపులోకి తీసుకున్నామని ఎస్.ఐ రమేష్ నాయుడు తెలిపారు. జూదగాళ్ల వద్ద నుంచి 2 పొట్టేళ్లను, 620 రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్ల ఉమామహేశ్వరరావు, కృష్ణమోహన్‌లు పాల్గొన్నారని తెలిపారు.

కొండాడ కొండల్లో నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని కొండాడ కొండల్లో 20 లీటర్లు నాటుసారాను ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకున్నారు. అదేవిధంగా 180 లీటర్ల వండుతున్న బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా కాచినా, అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల ద్వారా రవాణా చేసిన కేసులు పెడతామన్నారు. సారా నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు

మృతుల కుటుంబాలకు పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం గోయిపాక, జియమ్మ వలస మండలం బిత్రపాడు గ్రామాల్లో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బంధువులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, సర్పంచ్లు, ఎంపిటిసిలు , నాయకులు పాల్గొన్నారు.



మండల నాయకులతో మాట్లాడుతున్న పుష్పశ్రీవాణి